క్లుప్తంగా

పన్నుల వసూలు పూర్తి చేయాలి

• కమిషనర్ హరిత



సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతున్న కమిషనర్

నెల్లూరు సిటీ : ఆస్తి, కుళాయి, డ్రెయినేజీ పన్నులను ఈనెల 24వ తేదీలోపు వంద శాతం పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. నగరంలోని 10, 11, 14వ డివిజన్‌లోని వార్డు సచివాలయాలను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ కార్యదర్శులకు కేటాయించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. క్లాప్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలని, యూజర్ చార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రీసర్వేను 11లోపు పూర్తి చేయాలన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

నెల్లూరు రూరల్ : మహిళల హక్కులపై పూర్తిస్థాయి అవగాహన అవసరమని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు నాయక్ అన్నారు. రూరల్ పరిధిలోని నారాయణరెడ్డిపేటలో న్యాయవిజ్ఞాన సదస్సును గురువారం నిర్వహించారు. మహిళలు ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.

ఎమ్మెల్యే అనిల్‌ను కలిసిన వడ్డెర నేతలు



అనిల్‌ను సన్మానిస్తున్న వడ్డెర సంఘ నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్‌ను జిల్లా వడ్డెర సంక్షేమ సంఘ నాయకులు గుంజి గోపి ఆధ్వర్యంలో గురువారం కలిశారు. నెల్లూరు రూరల్, సిటీ పరిధిలో వడ్డెర సంఘీయులకు స్థలం కేటాయించాలని విన్నవించారు. ఈ సందర్భంగా అనిల్‌ను సత్కరించారు. జిల్లాలో మూడు లక్షల మంది వడ్డెరలు ఉన్నారని, నిరుపేద పిల్లలకు హాస్టల్ వసతి, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరారు.

పొణకా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



నెల్లూరు రూరల్ : స్వాతంత్ర్య సమర యోధురాలు, సంఘసేవకి పొణకా కనకమ్మ విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేయాల్సిందిగా సామాజిక ఉద్యమ కార్యకర్త డాక్టర్ వసుంధర కోరారు. నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డిని, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పొణకా కనకమ్మ సేవలకు గుర్తుగా విగ్రహ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

కిడ్నీ వ్యాధుల చికిత్సపై ప్రత్యేక రాయితీలు



నెల్లూరు(అర్బన్): ప్రపంచ కిడ్నీ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో గురువారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు కిడ్నీ వ్యాధుల చికిత్సపై ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్నామని హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపర్ స్పెషలిస్టులతో ఉచిత కన్సల్టేషన్, ఉచిత వైద్యసలహాలతోపాటు వైద్యులు సూచించిన పరీక్షలపై 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు తమ ఆస్పత్రిలో 115 కిడ్నీ మార్పిడులు విజయవంతంగా చేశామన్నారు. వివరాలకు 96401 00555 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని కోరారు. డాక్టర్ ప్రవీణ్‌కుమార్, నారాయణ హాస్పిటల్ ఏజీఎం భాస్కర్‌రెడ్డి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

స్కూటీ దగ్ధం

నెల్లూరు(క్రైమ్) : ఇంటి ముందు ఉంచిన స్కూటీ దగ్ధమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్‌కు చెందిన రాధిక ప్రైవేటు టీచర్. ఈనెల 8వ తేదీ రాత్రి ఎప్పటిలాగే ఆమె తన స్కూటీని ఇంటి ముందు పార్క్‌చేశారు. గురువారం తెల్లవారుజామున ఇంటి బయట మంటల్లో స్కూటీ కాలిపోతుండటాన్ని గమనించి నీటితో మంటలను ఆర్పారు. అప్పటికే స్కూటీ దగ్ధమైంది. ఈమేరకు బాధితురాలు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



ఓటర్‌కు బ్యాలెట్ నమూనా పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ ఆదాల తదితరులు

నెల్లూరు రూరల్ : తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులైన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిని ఆశీర్వదించాలని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూరల్ పరిధిలోని 32వ డివిజన్ డైకస్‌రోడ్డు ప్రాంతంలో గురువారం సాయంత్రం ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటు హక్కు కలిగిన వారికి బ్యాలెట్ నమూనా పత్రాలు అందజేసి తొలి ప్రాధాన్యత ఓటును వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని సూచించారు. రూరల్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. విజయా డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, కార్పొరేటర్‌లు అవినాష్, సత్తార్, శ్రీనివాస యాదవ్, మొబీనా, ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ తిప్పిరెడ్డి మమతారెడ్డి, ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు పి.రవి, నాయకులు మేఘనాథ్‌సింగ్, ఆసీఫ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పిల్లల్లో నులిపురుగులను నివారించండి

• కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు తదితరులు

నెల్లూరు(అర్బన్): పిల్లల్లో నులిపురుగులను నివారించాలని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు వైద్యశాఖాధికారులకు సూచించారు. ఈ నెల 14న జిల్లాలో నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల వారందరూ నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టల్స్‌లో విద్యార్థులందరికీ తప్పనిసరిగా ఆల్‌బెండజోల్ మాత్రలను వేయాలని తెలిపారు. దీనిపై ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ పెంచలయ్య, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ సుధీర్‌కుమార్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, సమగ్ర శిక్ష ఏపీఓ ఉషారాణి, ఆర్‌ఐఓ వరప్రసాద్, మైనార్టీ సంక్షేమశాఖ అధికారిణి కనకదుర్గాభవాని, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మెడికవర్ వైద్యులు

నెల్లూరు(అర్బన్): కిడ్నీ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెడికవర్ ఆస్పత్రి నెఫ్రాలజీ, న్యూరాలజీ వైద్యనిపుణులు డాక్టర్ మాధవ్‌దేశాయ్, డాక్టర్ సురేంద్రకుమార్ సూచించారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని మెడికవర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ప్రత్యేక కిడ్నీ చెకప్ ప్యాకేజీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్ మాట్లాడుతూ క్రియాటిన్, యూరిన్, అల్ట్రాసౌండ్ వంటి రూ.4 వేల ఖరీదైన పలు రకాల పరీక్షలను కేవలం రూ.699లకే చేస్తున్నామన్నారు. బీపీ, షుగర్, ఒబెసిటీ కలిగిన వారు, ఎక్కువగా పెయిన్ కిల్లర్స్ వాడే వారు కిడ్నీ సంబంధిత వ్యాధుల బారిన పడతారని తెలిపారు. కార్యక్రమంలో న్యూరాలజీ విభాగం డాక్టర్ యువరాజు, డాక్టర్ గోకుల్, ఆస్పత్రి వైస్ ప్రెసిడెంట్ మహేశ్వర్‌రెడ్డి, పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా 'మహిళా శక్తి' సత్కారాలు



ప్రతిభావంతులైన మహిళలను సత్కరించిన ప్రముఖులు

నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో గురువారం సృజన సాహితీ సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో 'మహిళా శక్తి-2023' స్ఫూర్తిదాయకంగా జరిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా ప్రాధాన్యత కలిగిన సినీగీతాలు, అభ్యుదయ గీతాలను ఔత్సాహిక గాయకులు ఆలపించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ చాటుతున్న 8 మంది మహిళలు జి.పద్మజారెడ్డి, ఎ.లక్ష్మీప్రసన్న, డి.మీనాక్షి, ప్రశాంతి, కె.ప్రమీల, ముత్తహర్‌బేగం, డాక్టర్ సీహెచ్ మాలిని, కె.సంధ్య, పి.పద్మావతిలను ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏపీ ఐడీసీ డైరెక్టర్ టి.మమతారెడ్డి, విశ్రాంత కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎ.హరిబాబు, అడ్వొకేట్ ఐ.వెంకటరమణ, ఆయుర్వేద వైద్యుడు కె.శ్యాంధన్, నృత్యగురువు వి.సంధ్యాశేఖర్, సైకాలజిస్ట్ సీహెచ్ రమేష్ బాబు, ఎస్వీ రమేష్‌బాబు, ఎస్.జయలక్ష్మి, ఎస్.మాధవి తదితరులు పాల్గొని మాట్లాడారు.

జిల్లాలో డీఐజీ పర్యటన

నెల్లూరు(క్రైమ్): గుంటూరు రేంజ్ డీఐజీ డాక్టర్ సీఎం త్రివిక్రమవర్మ గురువారం జిల్లాలో పర్యటించారు. పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి కుటుంబసభ్యులు, ఎస్పీ సీహెచ్ విజయారావుతో కలిసి వెళ్లారు. అనంతరం మర్రిపాడు పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. తర్వాత నెల్లూరుకు చేరుకుని పోలీసు అతిథిగృహంలో బస చేశారు. రాత్రి రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామిని దర్శించుకుని తిరిగి గుంటూరు బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట ఏఎస్పీలు డి.హిమవతి, శ్రీనివాసరావు, ప్రసాద్ ఉన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

నెల్లూరు (వీఆర్సీ సెంటర్) : నగరంలోని వెంకటేశ్వరపురంలో పెన్నా వంతెన వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం ఏర్పాటు చేశారు. శ్రీవెంకటేశ్వర పెయింటర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుచ వైఎస్సార్‌సీపీ నేతలు ముజీర్, మస్తాన్, వెంకటేశ్వర్లు, విశ్వనాథ్, విజయ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జనసేన సైనికుడి దౌర్జన్యం

నెల్లూరు(క్రైమ్) : జనసేనకు ఓటెయ్యమని మా ఇంటి గోడపై ఎందుకు రాశావని నిలదీసిన వ్యక్తిపై జనసేన పార్టీకి చెందిన వ్యక్తి దౌర్జన్యం చేశాడు. ఈ ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కిసాన్‌నగర్ మల్లెతోటకు చెందిన సుమన్ పనిమీద గతనెల 28వ తేదీన చెన్నైకు వెళ్లాడు. ఈక్రమంలో అదే ప్రాంతానికి చెందిన జీవన్ జనసేనకు ఓటెయ్యమని సుమన్ ఇంటి గోడలపై రాశాడు. ఇటీవల ఊరి నుంచి వచ్చిన సుమన్ ఎందుకు గోడ మీద రాశావని జీవన్‌ను నిలదీయగా అతనిపై దౌర్జన్యం చేశారు. బాధితుడు గురువారం రాత్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సమస్యల పరిష్కారానికి వినతి

నెల్లూరు(బృందావనం) : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్, ట్రెజరీ అధికారులకు గురువారం వినతిపత్రాలను అందజేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌ఎం.గౌస్, ఎస్వీవీఎస్ మూర్తి తెలిపారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

గొలుసు అపహరణ

నెల్లూరు(క్రైమ్) : వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగుడు తెంపుకెళ్లిన సంఘటన ఎఫ్‌సీఐ కాలనీ వాటర్‌ట్యాంక్ సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. పత్తివారి స్కూల్ ప్రాంతానికి చెందిన శంకరమ్మకు బర్రెలున్నాయి. ఎఫ్‌సీఐ కాలనీలో బర్రెలదొడ్డిలో వాటిని ఉంచింది. ప్రతిరోజూ సాయంత్రం ఆమె అక్కడకు వెళ్లి బర్రెలకు గడ్డివేసి వచ్చేది. ఈ నేపథ్యంలో ఆమె గురువారం రాత్రి బర్రెలకు గడ్డివేసేందుకు వెళ్లగా అక్కడే ఉన్న ఓ యువకుడు ఆమె మెడలోని సుమారు రెండు సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లాడు. దుండగుడు ముఖం కనిపించకుండా మాస్క్ ధరించి ఉన్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ వ్యవహారమే హత్యాయత్నానికి కారణం?

• నిందితుల కోసం పోలీసుల గాలింపు

నెల్లూరు(క్రైమ్): ప్రేమ వ్యవహారంలో ప్రత్యర్థులకు సహకరిస్తున్నాడని నెపంతో ఫార్మసీ విద్యార్థిపై హత్యాయత్నం జరిగినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. వసీం అక్రమ్ అనే ఫార్మసీ విద్యార్థిపై బుధవారం జరిగిన హత్యాయత్నం ఘటనపై బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ కె.రాములునాయక్ విచారణ వేగవంతం చేశారు. యువకుడిపై నిందితులు దాడి చేసిన దృశ్యాలు కళాశాలలో సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. వాటి ఫుటేజ్‌లను పోలీసులు గురువారం సేకరించి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుల్లో కొందరు విద్యార్థులు కాగా మిగలిన వారు బయటివారని సమాచారం.

బుజ్జమ్మరేవులో చోరీ

నెల్లూరు(క్రైమ్) : గది తాళాలు పగులగొట్టి బీరువాలోని నగలను అపహరించుకుని వెళ్లిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన సమాచారం మేరకు.. సంతపేట బుజ్జమ్మరేవులో భాస్కర్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన తన ఇంటిని రెండు రూమ్‌లుగా చేసుకున్నారు. ఇటీవల భాస్కర్ ఊరెళ్లారు. ఈనెల 7వ తేదీ రాత్రి ఆయన భార్య గీతాంజలి తన పిల్లలతో కలిసి ఓ గదిలో నిద్రపోయారు. రెండోగది తాళాలను గుర్తుతెలియని దుండగులు పగులగొట్టి బీరువాలోని సుమారు 15 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించుకుని వెళ్లారు.

వేమిరెడ్డికి కృతజ్ఞతలు



వేమిరెడ్డిని సన్మానిస్తున్న నారాయణబాబు

నెల్లూరు(సెంట్రల్) : రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన నెల్లూరు నారాయణబాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. రాజు, కోదండపాణి, చిట్టిబాబు, కంచి జనార్దన్, కరిముల్లా, రమణయ్య, విజయ్, వెంకి పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రిని అందజేస్తున్న వాకర్స్ సభ్యులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని నవలాకుల తోటలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాల వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం రూ.15 వేల విలువైన పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో అంతర్జాతీయ వాకర్స్ ఎలక్ట్ గవర్నర్ పలగాటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ 70 మంది విద్యార్థులకు తమ వంతు సాయంగా పరీక్ష సామగ్రిని అందజేశామన్నారు. ఫ్రెండ్స్ వాకర్స్ సభ్యుడు నూకరాజు సాయి సుబ్బారావు మాట్లాడుతూ 96 శాతం మార్కులు వచ్చిన విద్యార్థికి రూ.5,116లు అందజేస్తామన్నారు. వాకర్ ఇంటర్నేషనల్ కేబినెట్ ట్రెజరర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ పదిలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న విద్యార్థికి రూ.5,516 అందజేస్తానన్నారు. ఉపాధ్యాయుడు నసీర్ అహ్మద్, ఏసీ స్టేడియం అధ్యక్షుడు రఘురాం ముదిరాజ్, గౌరవాధ్యక్షుడు కిలారి తిరుపతి నాయుడు, 2022 వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై ఉత్తర్వులు

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ ఆదేశాల మేరకు 120 మైక్రాన్ లోపు ప్లాస్టిక్ కవర్లను, 60 కన్నా తక్కువ జీఎస్‌ఎం కలిగిన నాన్ ఓవెన్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను జిల్లాలో నిషేధించినట్లు కలెక్టర్ చక్రధర్‌బాబు తెలిపారు. ఈ ఉత్తర్వులను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ గురువారం రాత్రి జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, నగరపాలక సంస్థ కమిషనర్, పర్యావరణ ఈఈలకు ఆదేశాలు జారీ చేశారు. ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేసేందుకు ప్రతి మండలంలో కమిటీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే మాల్స్, మార్కెట్ ప్రదేశాలు, వీధి విక్రయదారులు, సినిమా హాళ్లు, స్కూల్స్, కాలేజీలు, ఆస్పత్రులు, రైల్వేస్టేషన్స్, బస్టాండ్‌లు, హోటళ్లు, ఆఫీస్ కాంప్లెక్స్‌లలో విస్తృతంగా తనిఖీలు చేసి ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని అరికట్టాలని ఆదేశించారు.

మర్యాదపూర్వకంగా..



మైనారిటీ నేతలతో మాట్లాడుతున్న ఎంపీ ఆదాల

నెల్లూరు రూరల్ : నెల్లూరు ఎంపీ, పార్టీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో గురువారం సాయంత్రం నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బారాషహీద్ దర్గా అభివృద్ధి, పలు సమస్యలపై వారు ఆదాలకు విన్నవించారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని ఎంపీ వారికి హామీ ఇచ్చారు.

సర్వేపల్లి కాలువలో వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైమ్) : నగరంలోని హరనాథపురం జంక్షన్ గుర్రలమడుగు సంఘం సమీపంలోని సర్వేపల్లి కాలువలో గుర్తుతెలియని వ్యక్తి (40) మృతదేహాన్ని స్థానికులు గుర్తించి బాలాజీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై కె.సుమన్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో కాలువ నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుని ఛాతీపై జ్యోతి అని పచ్చబొట్టు ఉంది. కుడిచేతి మణికట్టుపై హార్ట్(లవ్) గుర్తు ఉంది. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుని ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలి

• కలెక్టర్ చక్రధర్‌బాబు



పోలింగ్ శిక్షణను పరిశీలించి మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరు (అర్బన్) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనే అధికారులు నిబంధనల మేరకు విధులను నిర్వర్తించాలని కలెక్టర్ చక్రధర్‌బాబు సూచించారు. నగరంలోని వీఆర్‌పీజీ కళాశాలలో పీఓ, ఏపీఓలకు నిర్వహిస్తున్న శిక్షణను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ప్రత్యేక పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్‌కు సంబంధించిన మెటీరియల్, బ్యాలెట్ బాక్సులు సీల్ వేసేంత వరకు జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలన్నారు. వెబ్‌కాస్టింగ్ ప్రక్రియ నిరంతరంగా జరుగుతుందన్నారు. కలెక్టర్ వెంట కందుకూరు సబ్ కలెక్టర్ శోభిత, కావలి, ఆత్మకూరు ఆర్డీఓలు శీనానాయక్, కరుణకుమారి, నుడా వీసీ బాపిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డ్వామా పీడీ వెంకట్రావ్ ఉన్నారు.

చంద్రశేఖర్‌రెడ్డికి విద్యార్థి జేఏసీ మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిత్య సాయి

నెల్లూరు (టౌన్) : తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.చంద్రశేఖర్‌రెడ్డికి ఏపీ విద్యార్థి జేఏసీ మద్దతు తెలుపుతున్నట్లు జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్య సాయి తెలిపారు. స్థానిక వీఆర్సీ కళాశాలలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై సంపూర్ణ అవగాహన కలిగిన వ్యక్తి చంద్రశేఖర్‌రెడ్డి అని తెలిపారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల తెలుసని, వాటిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఆయన వంత కృషి చేస్తారన్నారు. అందరు ఓటు వేసి చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో హ్యూమన్ రైట్స్ సభ్యులు సంజయ్, జేఏసీ నాయకులు హరీష్‌యాదవ్, సునీల్, చరణ్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా వెబ్‌కాస్టింగ్ ప్రక్రియ

• కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్): పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వెబ్‌కాస్టింగ్ ప్రక్రియను ఎలాంటి లోపాలు లేకుండా పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు ఇంజినీరింగ్ విద్యార్థులకు సూచించారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో వెబ్‌కాస్టింగ్ ప్రక్రియపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. వెబ్‌కాస్టింగ్‌లో ఇంజినీరింగ్ విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొనడం సంతోషకరమన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పోలింగ్ మొదలైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు ఈ ప్రక్రియ చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, వెబ్‌క్యాస్టింగ్ నిర్వహణ నోడల్ అధికారి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

రేషన్‌షాపులో తనిఖీలు

నెల్లూరు(క్రైమ్) : నగరంలోని టెక్కెమిట్టలో ఉన్న రేషన్‌షాపులో నెల్లూరు అర్బన్ సివిల్‌సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ గోపీకృష్ణ గురువారం తనిఖీలు నిర్వహించారు. నిర్ణీత మోతాదు కంటే 3,364 కేజీల బియ్యం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. తనిఖీల్లో పలు అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో రేషన్‌షాపు డీలర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్‌అండ్‌బీ శాఖ కార్యదర్శిని కలిసిన కలెక్టర్



ప్రద్యుమ్నకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

నెల్లూరు (అర్బన్) : రాష్ట్ర రవాణా, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శి పీఎస్.ప్రద్యుమ్నను గురువారం కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి వచ్చిన ప్రద్యుమ్నకు కలెక్టర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. జేసీ కూర్మనాథ్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గంగాధర్, నేషనల్ హైవేస్ పీడీ గోవర్ధన్, డీటీసీ చందర్, ఆర్టీసీ ఆర్‌ఎం శేషయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ రామాంజనేయులు, డీఈ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గోవిందయ్యగౌడ్‌కు నటుడు సుమన్ నివాళి



గోవిందయ్యగౌడ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సుమన్

నెల్లూరు(బృందావనం) : గౌడ సేవా సమితి ట్రస్టు, కల్లు గీత పారిశ్రామికుల సంఘం మాజీ అధ్యక్షుడు దివంగత కోసూరు గోవిందయ్య గౌడ్‌కు నటుడు సుమన్ నివాళి అర్పించారు. నగరంలోని సుజాతమ్మ కాలనీలో ఉన్న ఆయన నివాసంలో గురువారం గోవిందయ్యగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సంఘ సభ్యులు రాజశేఖర్‌గౌడ్, ప్రభాకర్, ముత్యం గౌడ్, రామకృష్ణయ్య, కాశన్న పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

నెల్లూరు(క్రైమ్) : విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించి ఫ్లాట్‌లోని గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది సమాచారం మేరకు.. గోమతినగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో కె.కోటయ్య కుటుంబం నివాసం ఉంటోంది. గురువారం తెల్లవారుజామున ఏసీలో షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు వ్యాపించాయి. దీనిని గమనించిన కోటయ్య, ఆయన కుటుంబసభ్యులు ఫ్లాట్ నుంచి బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ఘటనలో గృహోపకరణాలు దగ్ధం కావడంతో రూ.లక్షల్లో ఆస్తినష్టం సంభవించింది.

డీకేడబ్ల్యూసీలో న్యాక్ టీమ్ పరిశీలన

నెల్లూరు (అర్బన్) :నగరంలోని దొడ్ల కౌశల్యమ్మ ప్రభుత్వ కళాశాలలో నాక్ అసిస్‌మెంట్ మొదటి రోజు గురువారం జరిగింది. పరిశీలనకు చైర్‌పర్సన్ డాక్టర్ సునీతా మిశ్రా, మెంబర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ అన్నా మేరీ ఫెర్నాండజ్, గౌరవ మెంబర్ సాజీముల్ అగస్టీన్ వచ్చారు. వీరు కళాశాలలోని వివిధ డిపార్ట్‌మెంట్‌లు, ఎన్ఎస్ఎస్, వైఆర్‌సీ, ఎన్‌సీసీ వింగ్స్‌ను పరిశీలించారు. ఈ ప్రక్రియ శుక్రవారం కూడా జరగనుంది.